క్లుప్తంగా

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



కమిషనర్‌ను సన్మానిస్తున్న దివ్యాంగులు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణ మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌ను చైతన్య దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో శాలువాతో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటి మిత్రుడు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు జలంపల్లి శ్రీనివాస్, ఆర్ సప్తిరి, గుల్జర్‌బాయ్, ఎన్నరం రవీందర్, నజీరాబాను, తిరుపతమ్మ, సత్తయ్య, సతీష్, బాపు పాల్గొన్నారు.

కోసినిలో వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో ప్రసాద్

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామంలో సిర్పూరు పేపర్ మిల్లు వారి సౌజన్యంతో స్పర్ష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎంపీడీవో కోట ప్రసాద్ వైద్య శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ఎస్పీఎం ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య సేవలను అందించడం అభినందనీయమన్నారు. డాక్టర్ శశిధర్ రెడ్డి, రేవతి సునీల్‌కుమార్, సుశీల, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు లెక్చరర్లు మాట్లాడుతూ క్రమ శిక్షణతో పాటు విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోరింటాకు సంబురాలు



సంబురాల్లో మహిళలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సిద్దివినాయక నగర్ కాలనీలో శనివారం మహిళలు ఆషాఢ గోరింటాకు సంబరాలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. గోరింటాకు ప్రాధాన్యతను వారు వివరించారు.

బోనాల ఊరేగింపునకు ఏర్పాట్లు

కాగజ్‌నగర్ టౌన్: ఆషాఢమాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలోని మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించేందుకు శనివారం ఏర్పాట్లు చేశారు. మహంకాళి బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని లారీ చౌరస్తా నుంచి ఆలయం వరకు భజాభజంత్రీలతో కళాబృందాలు, పోతురాజుల నృత్య ప్రదర్శనలతో దారి పొడవునా ఊరేగింపు నిర్వహించనున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం (జన్కాపూర్)లో నెలవారి మరమ్మతులో భాగంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ లక్ష్మీరాజ్యం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రాహ్మణవాడ, రావులవాడ, కంచుకోట, ఓల్డ్ పోస్టాఫీస్, సందీప్‌నగర్, నూర్‌నగర్, జన్కాపూర్ రామాలయం, కేబీ చౌక్, ఉస్మానియా మస్జీద్, దస్నాపూర్, హడ్కోకాలనీ, రహ్మత్‌నగర్, జుబ్లీమార్కెట్, ఎన్జీ కాలనీ, గోడవెల్లి, హీరాపూర్, ఎక్స్‌ప్రెస్ జిన్నింగ్ లైన్, ఎస్పీ ఫీడర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

పెచ్చులూడుతున్న వసతిగృహం

- శిథిలమైన ఎస్సీ హాస్టల్ భవనం
- ఒకే చోట ఎస్సీ, బీసీ విద్యార్థులకు వసతి
- వర్షాలకు ఉరుస్తూ, పెచ్చులూడుతున్న స్లాబ్
- ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థుల్లో ఆందోళన



మండల కేంద్రంలోని బాలురు వసతి గృహం



స్లాబు పెచ్చులు ఊడిపోయి తుప్పు పట్టిన రాడ్లు



పగుళ్లు తేలిన మరుగుదొడ్లు భవనం

వాంకిడి: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహం శిథిలావస్థకు చేరింది. 1995లో ప్రారంభించిన భవనం ప్రస్తుతం కూలడానికి సిద్ధంగా ఉంది. అయినా ఈ భవనంలో విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారు. బీసీ హాస్టల్ నిర్వహణకు ప్రత్యేకించి భవనం ఉన్నప్పటికీ అది పూర్తిగా శిథిలం కావడంతో ఎస్సీ భవనంలో కొనసాగిస్తున్నారు. ఇక పోతే మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. ఈ పరిస్థితి కొన్నేళ్లుగా ఉన్నప్పటికీ కొత్త భవన నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. 2010లో భవనం వర్షాలకు ఉరుస్తుండటంతో స్లాబ్‌పై అప్పట్లో బేరింగ్ కోట్ వేశారు. అది కాస్తా కిందికి వంగి లోపలి నుంచి పై పెచ్చులూడుతోంది. ప్రస్తుతం ఎస్సీ విద్యార్థులు 25 మంది, బీసీ విద్యార్థులు 80 మంది బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల బాలుర విద్యార్థులు మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో అడ్మిషన్లు పొంది హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు. గతంలో ఎస్సీ, బీసీ విద్యార్థులకు ప్రత్యేకించి వసతి గృహ భవనాలు ఉండేవి. బీసీ హాస్టల్‌లో వీరి సంఖ్య తగ్గడంతో ఆ భవనాన్ని రెండేళ్లు పునరావాస ప్రజలకు కేటాయించారు. వారిని వేరే ప్రాంతానికి తరలించాక ఆ భవనం వాడుకలో లేకుండా పోయింది. దీని కారణంగా పూర్తిగా పనికి రాకుండా పోయింది. ఆ తర్వాత బీసీ విద్యార్థులకు ఎస్సీ హాస్టల్ భవనమే ఆధారంగా మారింది. ప్రస్తుతం ఎస్సీ హాస్టల్ విద్యార్థులు 25 మంది ఉండగా, వారి వసతికి రేకులతో కూడిన ఒక పెద్ద హాల్ కేటాయించారు. వంట, ఆఫీస్ నిర్వహణకు ఒక్కో షెడ్డు కేటాయించారు. బీసీ విద్యార్థులు ఉంటున్న రూమ్‌లు ప్రమాదకరంగా ఉన్నాయి. హాల్ స్లాబ్ కిందికి వంగి ప్రమాదకరంగా ఉంది. స్టోర్ రూమ్ మినహా అన్నిగదులు వర్షాలకు ఉరుస్తుండటంతో ఎస్సీ విద్యార్థులకు కేటాయించిన హాల్‌లోనే నిద్రిస్తున్నారు. స్థలం సరిపోక కొందరు వరండాల్లో నిద్రిస్తున్నట్లు విద్యార్థులు తెలుపుతున్నారు. ఎస్సీ, బీసీ విద్యార్థులంతా కలిపి వంద మందికి పైగా ఉండగా వారందరికీ సరిపడా మరుగుదొడ్లు, బాత్రూంలు లేవు. ఉన్న 10 బాత్రూంలు పగుళ్లు తేలి దర్శనమిస్తున్నాయి.

ప్రశ్నార్థకంగా విద్యార్థుల చదువులు

బీసీ విద్యార్థులు ఉంటున్న హాల్‌లో కొన్నిరోజుల క్రితం స్లాబ్ పెచ్చులూడి పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గతంలో పలుమార్లు ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నట్లు విద్యార్థులు తెలుపుతున్నారు. కనీసం కరెంట్ బోర్డులు సరిగ్గా లేవు. ఇలాంటి పరిస్థితుల్లో అటు పిల్లల తల్లిదండ్రులోనూ ఆందోళన కలిగిస్తుంది. దీంతో ప్రస్తుతం విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంగా మారింది. బీసీ వసతి గృహ విద్యార్థులు ఇప్పటికే 80 మంది ఉండగా వారికే సరైన వసతి కల్పించలేకపోతున్నారు. హాస్టల్‌లో చేరాలనుకునే వారి అడ్మిషన్లపై ప్రభావం పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

నూతన భవనం మంజూరు చేయాలి



ఎస్సీ, బీసీ వసతి గృహ విద్యార్థులకు వసతి కల్పిస్తున్న భవనం ప్రమాదకరంగా ఉంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి. పెచ్చులూడిపోతున్న భవనంలో విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. అధికారులు నూతన భవనం మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– జగజంపుల తిరుపతి, పీడీఎస్‌యూ నాయకుడు

ప్రతిపాదనలు పంపించాం

బీసీ హాస్టల్ విద్యార్థులను ఎస్సీ హాస్టల్ భవనంలో కొనసాగిస్తున్నాం. భవనం వర్షాలకు కురుస్తుండటంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో ప్రైవేటు భవనం అద్దెకు తీసుకుని వసతి కల్పిస్తాం. మరమ్మతుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరయ్యాక పనులు చేపడుతాం.

– సజీవన్, బీసీ జిల్లా అభివృద్ధి అధికారి

ఇళ్ల ముందు డ్రెయినేజీ పూడిక

- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



ఇంటి ముందు వేసిన చెత్తాచెదారం

కాగజ్‌నగర్ టౌన్: డ్రెయినేజీల్లో తీసిన పూడికను ఇంటి ముందు వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలే స్వచ్ఛందంగా తమ ఇళ్ల ముందు ఉన్న మురుగును శుభ్రం చేసుకుంటున్నారు. పట్టణంలోని ద్వారకానగర్ కాలనీలో కొన్ని రోజులుగా మురుగు కాలువల్లోని వ్యర్థాలను తీసి ఇండ్ల ముందు వేయడంతో అపరిశుభ్రంతో పాటు దుర్వాసన వెదజల్లుతుంది. సంబంధిత వార్డు ఆఫీసర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందజేసిన పట్టించుకోకపోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పరిశుభ్రతపై ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్‌ను వివరణ కోరగా కార్మికులు సమ్మె, రెండు రోజులు వర్షం కారణంగా ఆలస్యమైందని, పరిశుభ్రత కోసం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీసీ రిజర్వేషన్ల ప్రకటనపై సంబురాలు



టపాసులు కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తీసుకురావాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో, బోథ్ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం బస్టాండ్ ఎదుట కార్యకర్తలు టపాసులు కాల్చారు. బీసీలకు రాజకీయ, సామాజికంగా న్యాయం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల సంఖ్యను పెంచేలా చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోద్దు గంగారెడ్డి, బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, పసుల చంటి, చట్ల ఉమేష్, షేక్ రజియా బేగం, నాజర్ అహ్మద్, యల్ల ఇంద్రారెడ్డి, సుద్దుల అరుణ్ రెడ్డి, చెట్లపల్లి అనిల్ పాల్గొన్నారు.

ఐక్యంగా ముందుకు సాగుదాం



సభ్యత్వం పొందుతున్న సభ్యులు

ఆదిలాబాద్‌అర్బన్: బస్సు యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండి ముందుకు సాగుదామని తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్ ఆపరేటర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మల్లేశం అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వచ్చిన అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులతో స్థానిక టీఎన్జీవో భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. పలు సమస్యలపై చర్చించారు. బస్సుల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా సభ్యులను చేర్చుకున్నట్లు తెలిపారు. ఉపాధి కరవై అనేక ఇబ్బంది పడుతున్నామని, ట్యాక్స్‌లు చెల్లించేందుకు అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం జిల్లా సభ్యులు రాష్ట్ర అసోసియేషన్ సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ప్రధాన కార్యదర్శి సాకత్ ఉసేన్, ఇమ్రాన్, మహేందర్, పాషా, సదక్ అలీ, ఉరడే సుభాష్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



ఆడే గజేందర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: ఆలయాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. కొట(బి) గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయానికి మొదటి విడత రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించిన ఆడే గజేందర్‌ను గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులు శ్రీనివాస్, అర్జున్, బబ్లూ, రవితేజ, పరమేష్ గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే పార్టీలో చేరిక

కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసే తాను పార్టీలో చేరడం జరిగిందని తేజాపూర్ యువ నాయకుడు శేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో ఆడే గజేందర్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నాడు జలకళ.. నేడు వెలవెల



నాడు జలకళతో ఎర్రవాగు ప్రాజెక్టు

దహెగాం: వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు అవుతున్నా.. భారీ వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టుల్లో, చెరువుల్లో వరద నీరు లేక వెలవెల బోతున్నాయి. మండలంలోని పీపీరావు ప్రాజెక్టులో గత ఏడాది ఈనెలలోనే వరద నీరు చేరి జలకళను సంతరించుకుంది. ఈ ఏడాది మాత్రం వెలవెల బోతోంది. భారీ వర్షాలు జాడ లేక పోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.



నేడు వెలవెల ఎర్రవాగు ప్రాజెక్టు

మోతాదుకు మించి ఎరువుల వాడకం

- చీడపీడలు విజృంభించే అవకాశం
- వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



వరి నారుమడిపై అవగాహన కల్పిస్తున్న ఏవో రామకృష్ణ

కాగజ్‌నగర్ టౌన్: పంటలో మోతాదుకు మించి ఎరువుల వాడటం ద్వారా వరి పైరులో చీడపీడలు విజృంభించే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అధిక దిగుబడి సాధించాలనే తపనతో రైతులు మితిమీరిన ఎరువులు వేయడం వల్ల పంటలో చీడ అధికంగా వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కాగజ్‌నగర్ మండలంలో వరి 7980 ఎకరాల్లో, పత్తి 2400 ఎకరాలు, మొక్కజొన్న 400 ఎకరాలు, కూరగాయాలు 4 వేల ఎకరాలు, కంది 1200 ఎకరాలు, పెసర 120 ఎకరాలు, జొన్న 250 ఎకరాలు సాగు చేస్తున్నారు. సొసైటీ ద్వారా యూరియాను ప్రస్తుతం రైతులకు అందిస్తున్నారు.

పోషకాలు అవసరం: ప్రతీ పంటకు నత్రజని, భాస్వరం, పొటాష్, వంటి స్థూల పోషకాలతో పాటు జింక్ మెగ్నిషియం, బోరాన్, కాల్షియం, సల్ఫర్ వంటి ఇతర పోషకాలు చాలా అవసరం. ప్రస్తుతం రైతులకు రసాయన ఎరువుల వినియోగంపై సరైన అవగాహన లేకపోవడం, పరిసర ప్రాంత రైతుల మధ్య నెలకొన్న పోటీతత్వం కారణంగా అవసరానికి మించి విచక్షణ రహితంగా ఎరువులు వాడుతున్నారు. దీంతో సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు, చీడపీడలు విజృంభించి జింక్, ఇనుము వంటి సూక్ష్మపోషక లోపాలు ఎక్కువ కావడం వంటి సమస్యలు ఎదరవుతున్నాయి.

నత్రజని వాడకం: నత్రజని ఎరువు సమర్థవంతంగా పని చేయాలంటే బురద పదునుపై చల్లి, 48 గంటల తరువాత నీరు పెట్టాలి. 50 కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండి లేదా 250 కిలోల తేమ కలిగిన మట్టి కలిపి 2 రోజులు నిల్వ ఉంచిన తరువాత పొలంలో చల్లడం వల్ల నత్రజని వినియోగం పెరిగి మొక్క దృఢంగా పెరుగుతుంది.

సూక్ష్మ పోషక లోపాలు: ప్రధానంగా జింక్ లోపం వల్ల నాట్లు వేసిన తరువాత మొక్కపై నుంచి 3 లేదా 4 ఆకుల మధ్య ఈనెల తెల్లగా పాలిపోతుంది. మధ్య ఈనె ముందుగా ఆకుపచ్చ నుంచి పసుపు రంగుకు, తరువాత తెలుపు రంగుకు మారుతుంది. జింక్ లోపం ఆశించిన ఆకులు చిన్నవిగా పెలుసుగా ఉండి, వంచగానే శబ్దం చేస్తూ విరిగి పోతాయి. జింక్ లోపం నివారణకు నాట్లు వేసిన 2 నుంచి 5 వారాల మధ్య పొలంలోని పాత నీటిని తీసి వేసి కొత్త నీటిని పెట్టాలి. తరువాత లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పైరంతా తడిచేలా పిచికారి చేయాలి. ఐదు రోజుల వ్యవధిలో రెండు మూడు పర్యాయాలు పిచికారీ చేడడం వల్ల లోపాన్ని పూర్తిగా నివారించవచ్చు.

దిగుబడులపై ప్రభావం



ప్రస్తుతం రైతులకు సరైన అవగాహన లేక ఎక్కువగా ఎరువులు వాడుతున్నారు. పంట దిగుబడి ఎక్కువ సాధించాలంటే తపనతోనే ఎక్కువ ఎరువులు వాడకం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. ఎరువుల అధిక వినియోగం వల్ల ఖర్చు పెరుగడమే కాకుండా పంటలో చీడపీడలు ఆశించి దిగుబడి తగ్గే ప్రమాదముంది. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు వినియోగిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– రామకృష్ణ, ఏవో, కాగజ్‌నగర్

ఆర్థికసాయం

తాంసి: మండలంలోని లీమ్‌గూడ గ్రామానికి చెందిన టేకం భారత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా.. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి శనివారం గ్రామానికి వెళ్లి భారత్ కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడొద్దని ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మృతుడి భార్యకు రూ.10వేల నగదు అందజేశాడు.

నిత్యావసర సరుకులు అందజేత



సరుకులు అందిస్తున్న మౌనిష్‌రెడ్డి

సాత్నాల: భోరజ్ మండలం పిప్పర్‌వాడ గ్రామానికి చెందిన మేడిపట్ల ఆశన్న ఇటీవల మరణించడంతో, వారి కుటుంబసభ్యులను పరామర్శించి, నిత్యవసర సరుకులను ప్రముఖ సామాజిక కార్యకర్త మౌనిష్ రెడ్డి అందించారు. ధైర్యం కోల్పోవద్దని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సంతోష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రశాంత్ రెడ్డి, కిష్టారెడ్డి, వినోద్ రెడ్డి, ఉషారెడ్డి, కె. రహీం, రాములు, రూపేష్, గణేష్, సుబ్బన్న పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



కూలిపోయిన డ్రెయినేజీ పైకప్పు

నేరడిగొండ: మండల కేంద్రంలోని సర్వీసు రోడ్లకు ఇరువైపులా ఉన్న డ్రెయినేజీ ప్రమాదకరంగా మారింది. వాటి పైకప్పులు కూలిపోవడంతో ప్రజలు అందులో పడి గాయపడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి డ్రెయినేజీపై పైకప్పు ఏర్పాటు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.